కొన్నాళ్ళకే "చాలా జబ్బుస్థితిలో నున్నది" అని నాకో తంతివార్త! ఉత్తరక్షణమందు మా ప్రణయగాధ కోస్వస్తి— నాకామె అద్దించి అమర్చిన చుట్టుచెంగావి కండువా ఇంకా గట్టిగానేవుంది. దానితో నా కన్నీళ్ళ నెంతగా తుడిచి ఆరబట్టినా ఆ రంగు వట్టిరంగుగా తిరోహితం గావడంలేదు. స్థిరపడి పోయింది.

ఒకవేళ వసనం చివికి చిరిగి జీర్ణించి పోయినా చనిపోయే దెవరు? ఆమె కాదు. నేను!

.... .... .... .... ....

## పొగకర్రలు

నా సంతానంలో ఒకానొక చిరుసగవు శిశువు చనిపోయినప్పుడు, "ఎక్కడ పాతిపెట్టారు?" అని అడిగాను నా తండ్రిని. అప్పటికి మా తండ్రిగారు జీవించివున్నారు. ఆయన నన్ను గదుముతూ "నీ కెందుకు వానిని గుఱించి మఱి ఆందోళన, ఆలోచన. ఆవాడు పున్నమ వెన్నెల రేని వెళ్ళిపోయినాడు. చంద్రబింబంలో వుంటాడీపాటికి!" అని సమాధానం చెప్పాడు. పెద్దలు చెప్పినమాట విశ్వసించాలికదా అని ఆలా చంద్రబింబం కేసి చూస్తూ నివ్వెఱపోతున్నాను నాటికీ నేటికీ "ఎన్నడా చంద్ర కవాటం తెరవడం?" అని. నాకు సాధ్యమౌతుందా?

మఱో అప్పుడు మఱో శిశువు—సొంతబిడ్డ! కేరుమన కుండానే స్వర్గలోకం చూఱగొన్నట్టు విన్నాను. "ఎక్కడ పాతి పెట్టారు?" అని తిరిగి ప్రశ్నించగా ఇంటిలోని ముసిలిఅవ్వ

"ఓరీ! కుర్రా! నీ కెందుకు ఆ కూసునుగురించి గోడు? వాడు మిట్టమధ్యాహ్నాం చెల్లిపోయినాడు. సూర్యమండలంలో వుంటాడీ పాటికి" అని సమాధానం చెప్పింది. ఆమె మాటను నమ్ముతూ తలవంచుకుని, ఎండలోపడ్డ నీడనల్లా పరిశీలించసాగెను.

మూడవతూరి మూడేండ్ల ఆడపిల్ల చనిపోయినది. ముద్దు ముద్దుగా మాట్లాడేది. అప్పుడుకూడా అదేప్రశ్న వేశాను నా బందుగుల్ని "ఎక్కడ పాతిపెట్టారు?" అని. వాళ్లు చెప్పారు "ఆమె సాయం సంధ్యాసమయంలో గతించింది. ఈ పాటికి ఆకాశంమీద చుక్కనుండి చుక్కకు గెంతుతూ వుంటుంది! ఎందుకు నీకు వంత?" అని ఊఱడింప మొదలు పెట్టారు. కాని మూడవతూరి మృత్యుదేవత అతి నగ్నంగా నా యెదుట సాక్షాత్కరించింది. "సిగ్గులేదూ నీకు? బట్టయినా కట్టుకోకుండా, అధమపక్షం జఘనభాగాన్ని శిరోజాల్నయినా ముందుకు వేసుకు కప్పుకోకుండా నా యెదుట ఆ నిలబడ్డం ఏమిటి? అని కసిరాను.

ఆమె అంది "నా ఎల్లప్పటిరూపం ఇదేను. నీవు ఈనాడు చూడగలిగావు. చూడగలిగినీన్ని నానగొంటున్నావు. నాకు నవ్వు వస్తూవుంది." అని నవ్వింది. ఆ నవ్వుతో చంద్రకవాటం తెరవ బడింది. సూర్యమండలం చల్లబడింది. ఎక్కడచూచినా లక్షోప లక్షలు నక్షత్రాలే! మఱి నేనుగన్నది—నా పోయిన ముగ్గురు పసికూనలు ఒకళ్ళతో వొకళ్లు పందెంవేసికొన్నట్టుగా ఒక చుక్క నుండి ఒక చుక్కకు గంతులువేసికొంటూ అతిసంతోషంగా ఆకాశమ్మీద సంచరిస్తూన్నట్టుగా ఒకానొక దృశ్యం ప్రదర్శిత మైంది, ఆ గెంతేటప్పుడు వాళ్ళల్లో వొక్కళ్లైనా, నక్షత్రంనుండి

నక్షత్రంను గెంతెలో, క్రిందకు జారిపడరా ? క్రిందకు జారి పడరా ? " అని ఆసిస్తూ ఆలోసిస్తూవున్నాను పదిపంద్రెండేడ్లుగా!

ముగ్గురు పసికూనలు—నా నెత్తురుపుట్టలు— నా సత్తువ పట్టులు—వాళ్ళ శక్తికొద్దీ వాళ్ళసామర్ధ్యంకొద్దీ చుక్కనుండి చుక్కకు, వంతులువేసికొంటూ, గగనసీమను గంతులువేస్తూ వున్న దృశ్యం నిజంగా వర్ణనాతీతం అమృతోపేతం !

ఆలా ఆలోచిస్తూవుండగానే ఏదో అప్సరస రంభలా, నా వెనుకకువచ్చి వెనకనుండే నా కళ్లు దాగుడుమూతలో మూసినట్టు, తన రెండుచేతులా మూసేసింది. నాకు ఒక్కపాట వినిపించలేదు. ఒక్క ఆట కనిపించలేదు. ఆమె చేతులమీదను చేతులు వేసి తడిమినప్పుడు ఆమె చేతులు వాతంగమ్మిన చేతుల్లా చల్లగా తట్టాయి. నా చేతులు అంతకన్నా శీతలంగా వున్నట్లు వ్రేళ్లు కొంకర్లు పోసాగినాయి.

" ఎవరునువ్వు ? " అన్నాను " ఇందాకా చూడలేదు నన్ను ? " అని పకాల్నవ్వింది. నవ్వును బట్టి ఆమెను మృత్యుదేవతగా బోల్చగల్గాను. " నీవు నన్ను విడిచిపెట్టవూ ? నీవు నన్ను విడిచిపెట్టవూ ? అధమపక్షం నా కళ్ళమీదనుంచి నీకరాంగుళులైనా కాసంత వొత్తిగించవు ? ఏమిటీ క్రౌర్యం ? " అన్నాను.

అంటే ఆమె " నక్షత్రానికి నక్షత్రానికి గెంతేలో ఒకవేళ సినిసుగును జారిపడినా వాళ్లు నీ చేతిలోపడరు—నా గోతిలో పడతారు—చూడు నేత్రవ్విన పెద్దగొయ్యి, ఏ మానవుడు ఏ దానవుడు త్రవ్వలేడు " అంది. చకితుణ్ణై చట్రాల్న ఆమె చంకల్లోకి నా చేతులు పోనిచ్చాను. కితకితలచేతనైనా నా కళ్ళను

నళ్ళిస్తుందేమోనని. "అమృతప్రాశంచేసి యిప్పుడు నేను నా తక్కిన రూపాన్ని వదలివేయగలిగాను. ఒక్క ఈ వాతం గమ్మిన చేతి వ్రేళ్ళు మాత్రమే వున్నాయి. నీవుపెట్టే కితకితలు నా మీదేమీ పనిచేయవోయి! వెఱ్ఱివాడా?" అంది.

అందో లేదో—పెద్ద అశనిపాతధ్వనిలాంటి ధ్వని వినబడింది—వెలుగు చూడలేదు నేను. చూడ్డానికి నా కళ్ళమీద ఆమె చేతులలాగునే కప్పివున్నాయి. మఱి తాదిగ మ్రింగవలసిన అమృత కబళం నేనే ఏమో-ధ్వనిచేతను మాత్రం చెవులు గళ్ళడ్డట్టయ్యాయి. "ఎవరు పడింది? ఎక్కడ పడింది?" అనే ప్రశ్న వేయడానికే సాధ్యపడిందికాదు!

వెనక్కు నేనొక పెద్దగోతిలోనికి త్రోయబడి వున్నాను. నా మీద రంగురంగుల పువ్వులు, మెత్త మెత్తని చిగుళ్ళు, చల్ల చల్లని నీరుగాలితుంపురులు! తుంబురుల తుంబుర తందనాలు! తఱుగని తాండవ తారంగములు!

నక్షత్రమునుండి నక్షత్రమునకు గెంతువారు దిగజారి దిగజారి పువ్వునుండి పువ్వుమీదకు గెంతుదురుగాక! అంతులేని ఆనందం నా కందింతురుగాక!

మృత్యువు దోసిలి పెద్దకొలిమిగా మాఱిపోయినది. ఆ కొలిమిలో తెగ్గాలు మూసగా నా హృదయం పరివర్తనం గన్నది. ఆ మూసలో—బంగారమనుడు, వెండి అనుడు, రాగి అనుడు, అనురాగమనుడు—నా మనస్సు కరిగి కరిగి ద్రవీభూతమైపోవుచున్నది.

తీయని సంగీతం విన్నచో నా చక్షుయుగళి చెమ్మగిలక మానదు. చక్కని చిత్రలేఖనము గన్నచో నా యొదలిని

చెమ్మట గ్రమ్మక తప్పదు. మరి సృష్టిలో యట్టిమూర్తి నెద్దాని నరసినప్పటికి అదో అంతులేని కళవళిక జనించి లిలువెల్ల నీడ లేని ఊగిసలాట తూగిపోవును! ఏది యీపునది? ఎవరు చూపునది?

.... .... .... .... ....

## మంచుగది

"మా నాన్నను మర్నాడు రాత్రిఅల్లా మంచుగదిలో వుంచారుట! ఎందుకంటారు? పెద్దనాన్నగారూ?" అని అడిగేడు చిన్నకుఱ్ఱవాడు—వానితో కొంతసేపు నేను పరామర్శప్రస్తావన జరిపిన యీ వెనుకటి విస్తరింపులో. వానికేమని చెప్పేది జవాబు? "అదో విధమైన చికిత్స కావచ్చును" అని ప్రత్యుత్తరమిచ్చాను. "చికిత్స కాదన్నారండి డాక్టర్లు శరీరాన్ని చిరంతనంగా వుంచేది మంచుగడ్డ అన్నారండి వాండ్లు! ఆ పెద్ద పెద్దవాండ్లు! ఆ జెనరల్ హాస్పిటాల్లో! ఆ మదరాసులో!"

ఇలా కుఱ్ఱవాడు తన విజ్ఞానాన్ని వెదజల్లుతూవుంటే నా హృదయం కరిగి నీరైంది. నీరవుండనై ఏదో తలపోశేను. నా తలపోత కడ్డొచ్చినట్టు ఆ బిడ్డడు "మంచుగడ్డ కరిగిపోకుండా వుంటుందా అండీ! మరి!" అని అడిగాడు. "గడ్డ వెనుక గడ్డ పెడతారులాగుంది" అన్నాను, ఏదో జవాబు నాకు చెప్పాలికదా అని. కాని నా అంతస్సు అప్పటికప్పుడే నానుండి విడివడి పోయింది. ఎచ్చటెచ్చటో పక్షిలా ఎగిరిపోతూ వుంది. "అయితే హిమాలయం మధ్య చావులేదన్నమాట" అని అడిగాడు మళ్ళీ